సాక్షి మహబూబాబాద్
శుక్రవారం | 29 | ఆగస్టు | 2025



సీఎస్‌సీలోనూ విద్యుత్ బిల్లుల స్వీకరణ

- 8లో▸

ఇకనుంచి కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కల్పించింది.



సైబర్ వలలో ఆలయ ఉద్యోగి

సైబర్ వలలో చిక్కుకుని కురవి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ సీనియర్ అసిస్టెంట్ కట్ట జగన్నాథం రూ.8.72 లక్షలు మోసపోయాడు.

- 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాకాల ఏరు దాటొద్దు

● మహబూబాబాద్ డీఎస్పీ తిరుమలరావు



గార్ల: ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల ఏరు దాటేందుకు ప్రజలు సాహసం చేయొద్దని మహబూబాబాద్ డీఎస్పీ తిరుమలరావు సూచించారు. గురువారం గార్ల సమీపంలో పాకాల ఏరు వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. వరద ఉధృతి తగ్గేవరకు పాకాల ఏటి వద్ద 24గంటలు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పహారా కాయాలని సూచించారు. అదే విధంగా గణేశ్ విగ్రహాలు ఏర్పాటు చేసినవారు విధిగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, నిమజ్జనం సమయంలో ఘర్షణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గార్లబయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై రియాజ్‌పాషా పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి: ఎస్పీ

మహబూబాబాద్ రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో వర్ష సూచనలపై పోలీసు అధికారులు, సిబ్బంది సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రజలకు సమాచారం అందిస్తూ అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు స్థానిక పోలీసులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే డయల్ 100కి లేదా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 87126 56 928ను సంప్రదించాలని సూచించారు. పశుసంపద, ప్రాణ,ఆస్తినష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

అప్రమత్తత అవసరం



కురవి: వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో సూచించారు. గురువారం మండలంలోని నల్లెల్ల, మోద్గులగూడెం గ్రామాల్లోని చెరువులు, మోద్గులగూడెంలోని జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో చెరువులు, కాల్వలు, లోలెవల్ వంతెన, కుంటలను నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. హైస్కూల్‌లో పిల్లలకు రుచికరమైన వేడివేడి ఆహారం అందించాలన్నారు. తహసీల్దార్ విజయ, ఎంపీడీఓ వీరబాబు, ఇరిగేషన్ ఏఈఈనరేశ్, ఆర్‌ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ సహజం



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గురువారం డీఈఓ రవీందర్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రవీందర్‌రెడ్డితో మానుకోట జిల్లా విద్యాశాఖలో కీలక మార్పు వచ్చిందని, పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలవడానికి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ.. డీఈఓ రవీందర్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని పని చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ పురుషోత్తం, జిల్లా అధికారులు నర్సింహస్వామి, సురేష్, దేశిరాంనాయక్, కృష్ణవేణి, విజయ, శ్రీరాములు, అప్పారావు, ఆజాద్‌చంద్రశేఖర్, ఉమామహేశ్వర్‌రావు, సంతోష్, ఎంఈఓలు లచ్చిరాం, వెంకటేశ్వర్లు, అధికారులు, ఉద్యోగులు, పీఆర్టీ యూ, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ, టీపీటీఎఫ్, యూటీఎఫ్, వివిధ సంఘాల బాధ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వచ్చే నెల 22 నుంచి 'ఓపెన్' సప్లిమెంటరీ

విద్యారణ్యపురి: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సెప్టెంబర్ 22 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ అనగోని సదానందం తెలిపారు. ఆయా పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈఏడాది అక్టోబర్ 6 నుంచి 13 వరకు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఓపెన్ స్కూల్, టెన్త్, ఇంటర్ విద్యార్థులు థియరీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

మెడికోల సతమతం!

హాస్టల్ సౌకర్యం లేక అవస్థలు

- పాత కలెక్టరేట్‌లో కొంతకాలం వసతి
- జేఎన్‌టీయూ విద్యార్థుల కోసం ఖాళీ చేయించిన అధికారులు
- అర్ధంతరంగా సామగ్రితో ఇంటికి పయనం
- హాస్టల్ భవన నిర్మాణం పూర్తయినా అప్పగించని ఆఫీసర్లు
- సెప్టెంబర్ 2నుంచి పరీక్షలు.. ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి



పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మెడికల్ కళాశాల హాస్టల్ భవనం

సాక్షి, మహబూబాబాద్: ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే మూడు బ్యాచ్‌లు రాగా మరో బ్యాచ్ రానుంది. కళాశాల భవన నిర్మాణం దేవుడెరుగు.. హాస్టల్ భవనం పూర్తి చేసినట్లు చెబుతున్న అధికారులు కళాశాలకు అప్పగించడం లేదు. దీంతో మెడికల్ విద్యార్థులు ఎక్కడ ఉండాలో తెలియక సతమతవుతున్నారు. నిర్మాణ పనులు పూర్తయిన హాస్టల్ భవనం అప్పగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రిన్సిపాల్, జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

వారి పాపం.. వీరికి శాపం

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు చేయడంతో పాటు స్థలం కేటాయించి రూ.250కోట్ల మేరకు కేటాయించారు. వీటితో పాటు మెడికల్, నర్సింగ్ కళాశాలల భవనాలు, ల్యాబ్స్, థియేటర్లు, 20 విభాగాల డాక్టర్ల చాంబర్లు, బెడ్స్, క్రిటికల్ కేర్ భవనాలు, డైనింగ్ హాల్, విద్యార్థిని, విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ల కోసం క్వార్టర్స్ నిర్మించాలి. అయితే పనులు ప్రారంభించి నాలుగు సంవత్సరాలు గడిచినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ నర్సింగ్ కళాశాల కోసం నిర్మించిన భవనంలోనే తరగతులు జరుగుతున్నాయి. దీంతో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు సరిపడ ఉన్నా.. హాస్టల్స్, క్వార్టర్స్ లేక విద్యార్థులు, ప్రొఫెసర్లు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదేం తాత్సారం..

సరైన వసతులు కల్పించకపోతే ప్రస్తుతం కౌన్సెలింగ్‌లో కళాశాలకు సీట్లు కేటాయించమని హెచ్చరిక చేసిన నేపథ్యంలో ఉరుకులు, పరుగుల మీద పనులు చేశారు. హాస్టల్స్, డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం ఉన్న 330 పడకలకు తోడుగా ఈ విద్యాసంవత్సరం ప్రారంభం వరకు 600కు పైగా పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు 50 పడకల క్రిటికల్ కేర్, 250 పడకల జనరల్ విభాగాల కోసం పనులు చేస్తున్నారు. ఇప్పటికే మూడు బ్యాచ్‌లకు చెందిన 450 మంది విద్యార్థులు చదువుతుండగా.. పది పదిహేను రోజుల్లో నాల్గో బ్యాచ్ 150 మంది విద్యార్థులు వస్తారు. కాగా పూర్తి చేసిన హాస్టల్ భవనాలను తాత్సారం చేయకుండా అప్పగిస్తే ఇబ్బందులు తొలుగుతాయని మెడికల్ కళాశాల విద్యార్థులు కోరుతున్నారు.

హాస్టల్ లేక అవస్థలు

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలకు దీటుగా తరగతులు నిర్వహిస్తున్న మానుకోట మెడికల్ కళాశాలకు హాస్టల్ వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణాల్లో జాప్యం కావడంతో విద్యార్థినులకు పాత కలెక్టరేట్‌లో హాస్టల్ నిర్వహించారు. అయితే అక్కడే జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయడంతో మెడికల్ విద్యార్థినులు అర్ధంతరంగా ఖాళీ చేయాల్సి వచ్చింది. దీంతో ఎక్కడ ఉండాలో తెలియక ఇంటిబాట పట్టిన విద్యార్థినులు తరగతులకు సక్రమంగా హాజరు కాలేకపోయారు. అయితే సెప్టెంబర్ 2నుంచి సెమిస్టరీ పరీక్షలు ఉన్నాయి. హాస్టల్ వసతి లేకపోయినా ఇంటి వద్ద ఉండి చదువుకున్న విద్యార్థినులు ఇప్పుడు పరీక్షలు రాసేందుకు తప్పనిసరిగా రావాల్సి ఉంది. అయితే హాస్టల్ లేదు. ఇలాంటి పరిస్థితిలో ఆడపిల్లలను ఎలా పంపించాలి.. ఎక్కడ ఉంచాలని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పిల్లలను పంపించాలంటే భయమేస్తోంది



మా పాప ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇరుకు గదుల్లో వసతులు లేకుండా జేఎన్‌టీయూ కాలేజీలో ఉన్నారు. అక్కడి నుంచి అర్ధంతరంగా ఖాళీ చేయించారు. సెప్టెంబర్ 2నుంచి పరీక్షలు ఉన్నాయి. పిల్లలను పంపించాలంటే భయమేస్తోంది. ఎక్కడ ఉండి పరీక్షలు రాస్తారు. పూర్తి చేసిన భవనాలు అప్పగించాలి.

\- కె. వెంకటేశ్వర్‌రావు, విద్యార్థినితండ్రి, హైదరాబాద్

త్వరలో ప్రారంభిస్తాం..



మెడికల్ కళాశాల విద్యార్థుల హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు కూడా వేగవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించాను. పూర్తి చేసిన హాస్టల్ భవనాల ప్రారంభం కోసం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి అపాయింట్ మెంట్ కోరాను. త్వరలో ప్రారంభించి విద్యార్థులకు అప్పగిస్తాం.

\- భూక్య మురళీ నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే

గార్లలో గణనాథుడి సన్నిధిలో భక్తులు



కొలువుదీరిన గణనాథుడు..

మహబూబాబాద్ రూరల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు భారీ సెట్టు వేసి గణనాథులను ప్రతిష్ఠించారు. జిల్లా కేంద్రంలో శ్రీమహాలక్ష్మి గణపతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గోమయ గణపతిని కొలువుదీర్చారు. అదేవిధంగా పలు చోట్ల మట్టిగణపతి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు. విఘ్నేశ్వరుడు తమను ఆశీర్వదించాలని భక్తులు వేడుకున్నారు. ఇదిలా ఉండగా గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిశోర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృత పోలీసు బందోబస్తు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

కోతుల బెడదతో గణపయ్యకు ఇల్లు





కంబాలపల్లి గ్రామంలో గణపయ్యకు నిర్మించిన ఇల్లు

మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామంలో గణపయ్యకు భక్తులు ఇల్లు నిర్మించి పూజలు ప్రారంభించారు. గణపయ్యకు ఇల్లు నిర్మించటం ఏమిటీ అనుకుంటున్నారా.. గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉంది. లడ్డూ, ప్రసాదాలు, ఇతర సామగ్రి రక్షణ కోసం వేప చెక్క బెండ్లతో చిన్న ఇల్లు మాదిరిగా నిర్మించి అందులో గణపతిని కొలువుదీర్చి పూజిస్తున్నారు. ఇలా చేయడం వల్ల తమ గణపతికి కోతుల తాకిడి ఉండదని భక్తులు పేర్కొన్నారు.

\- మహబూబాబాద్ రూరల్

- మరిన్ని ఫొటోలు 9లో▸

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



బయ్యారం: పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న బాలుడితో మాట్లాడుతున్న కలెక్టర్

మహబూబాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ క్యాంపు కార్యాలయం నుంచి తహసీల్దార్లు, కమిషనర్లు, సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక బృందాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. చెరువులు, వంతెనలు, వాగులు, లోలెవల్ బ్రిడ్జి తదితర ప్రదేశాల్లో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, అనిల్‌కుమార్, ఆర్డీఓలు కృష్ణవేణి, గణేష్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

హాజరుశాతం పెంచాలి

విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో గురువారం విద్యాశాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, డీఈఓ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు పరిశీలన..

బయ్యారం: మండలంలో గురువారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా పర్యటించారు. బయ్యారం పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన లేబర్ రూం, వార్డులు, మందుల గది, సిబ్బంది హాజరు, మందులస్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారితో మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలోని సబ్‌సెంటర్లలో షెడ్యూల్‌ప్రకారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బయ్యారంలోని బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. తర్వాత బయ్యారం పెద్దచెరువు అలుగులు, ఇల్లెందు–మహబూబాబాద్ రహదారిపై ఉన్న జిన్నెలవర్రె లోలెవల్ కల్వర్ట్‌ను కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, వైద్యాధికారి విజయ్, ఎంఈఓ దేవేంద్రాచారి తదితరులు ఉన్నారు.

జ్వరపీడితులు..

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- ఆస్పత్రులకు పరుగులు పెడుతున్న జనం
- జీజీహెచ్‌లో పెరుగుతున్న ఓపీ
- జిల్లాలో 176 డెంగీ కేసులు నమోదు

జిల్లాలో డెంగీ కేసుల వివరాలు

ఏడాది	కేసుల సంఖ్య
2024	419
2025 (ఇప్పటి వరకు)	176



జీజీహెచ్‌లో ఓపీ చీటీల కోసం క్యూలో నిల్చున్న రోగులు (ఫైల్)

నెహ్రూసెంటర్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దగ్గు, జ్వరం, నొప్పులతో ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతీ ఇంట్లో ఒకరు, ఇద్దరు చొప్పున జ్వరం బారినపడి వైద్యం కోసం ఆస్పత్రుల్లో క్యూ కడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు, చిన్న పిల్లల ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ఇదిలా ఉండగా గతేడాది జిల్లాలో డెంగీ విలయతాండవం చేయగా.. ప్రస్తుతం ఇప్పటి వరకు 176 డెంగీ కేసులు నమోదు కాగా.. ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పారిశుద్ధ్య లోపంతోనే..

పారిశుద్ధ్యలోపం కారణంగా డెంగీ కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మహబూబాబాద్ పట్టణం, ఇందిరానగర్, వడ్డెర కాలనీ, కేసముద్రం మండలం సర్వాపురం ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇంటి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, మురికినీరు కాల్వల్లో ప్రవహించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమలు వ్యాప్తి కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్యులు తెలుపుతున్నారు.

అవగాహన, మెడికల్ క్యాంపులు..

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పట్టణంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రజల వద్దకే వెళ్లి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల్లో జ్వరం తగ్గకుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు నోడల్ అధికారులను నియమించి సీజనల్ ముప్పుకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది.

176 డెంగీ కేసుల నమోదు...

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 176 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తూ నమోదు కానీ కేసులు కూడా ఉన్నాయి. గతేడాది 419 డెంగీ కేసులు, అలాగే మలేరియా, చికెన్‌గున్యా వంటి కేసులు నమోదయ్యాయి.

ప్రైవేట్‌కు వెళ్తే అంతే సంగతులు..

ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే రోగుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఆస్పత్రికి వెళ్లింది మొదలు టెస్టులు, అడ్మిట్, ట్రీట్‌మెంట్ అంటూ అత్యధిక ఫీజులను వసూలు చేస్తున్నారని ప్రజలు, రోగులు ఆరోపిస్తున్నారు. జ్వరం, దగ్గు అని వెళ్తే తప్పనిసరిగా టెస్టులు రాస్తున్నారు. పిల్లల ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. జలుబు, దగ్గు, జ్వరంతో చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొంతమంది అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

రోగుల రాక పెరిగింది..



సీజనల్ వ్యాధులు ప్రారంభం కావడంతో జీజీహెచ్‌కు రోగుల రాక పెరిగింది. ప్రతీ రోజు సుమారు 1100 నుంచి 1300 మంది వరకు ఓపీ నమోదువుతుంది. ఆస్పత్రికి వచ్చిన రోగులను పరీక్షించి ఆరోగ్య సమస్య ఉంటే అడ్మిట్ చేసి చికిత్స అందజేస్తున్నాం. ఆస్పత్రిలో వైద్య బృందం, సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిరంతరంగా వైద్య సేవలు అందిస్తున్నాం.

\- డాక్టర్ శ్రీనివాసరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్


ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




సీజనల్ కాలంలో వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఇంటి పరిసరాల పరిశుభ్రత, మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలి. జ్వరం బారిన పడిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా చికిత్స పొందవచ్చు.

\- రవిరాథోడ్, డీఎంహెచ్‌ఓ

పంటలకు యూరియా అందించాలి



రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, రైతులు



తొర్రూరులో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

● రోడ్డుపై బైఠాయించి రైతుల రాస్తారోకో

మహబూబాబాద్ రూరల్: పంటలకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూజిల్లా కేంద్రంలోని తొర్రూరు ప్రధాన రహదారిపై గురువారం రైతులు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ రైతులకు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. కాగా, ఆందోళనతో రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేపట్టి రైతులకు రైతు బంధు, రైతు భీమా పథకాలతో పాటు యూరియా అందించలేకపోతుందని విమర్శించారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలో నిలబడాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని, లేనిపక్షంలో రైతులకు అండగా ఉండి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకోలో బీఆర్‌ఎస్, సీపీఐ నాయకులు లూనావత్ అశోక్, తండ సందీప్, నలమాస సాయి, బానోత్ భాస్కర్, జేరిపోతుల వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతులు..

తొర్రూరు: యూరియా కొరత తీర్చాలంటూ రైతులు పట్టణంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. రాస్తారోకోతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాల్లో యూరియా సరిపడా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పీఏసీఎస్ కేంద్రంలో యూరియా సరిపడా లేకపోవడంతో తొర్రూరులో ప్రైవేట్ దుకాణాల దందా కొనసాగుతుందన్నారు. పోలీసులు జోక్యం చేసుకుని యూరియా ఇప్పిస్తామని హామీనివ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

కేయూ పరిధిలోని పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: భారీ వర్షాల నేపథ్యంలో కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న పరీక్షలు వాయిదా వేసినట్లు గురువారం పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ తెలిపారు. కేయూ పరిధి బీఫార్మసీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు, ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షలు, ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల ఆరో సెమిస్టర్ పరీక్షలు, ఎంఈడీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు తెలిపారు. దూరవిద్య డిగ్రీ ఇయర్ వైజ్ స్కీం మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరానికి సంబంధించిన పరీక్షలు సైతం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి ఆయా కోర్సుల పరీక్షలు టైంటేబుల్ ప్రకారమే యథావిధిగా జరుగుతాయని తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో జరగాల్సి ఉండగా.. వాయిదాపడిన పరీక్షలు మళ్లీ ఎప్పుడు నిర్వస్తారనేది తర్వాత ప్రకటిస్తామన్నారు.

నేత్రదానాన్ని ప్రోత్సహించండి

నెహ్రూసెంటర్: నేత్రదానం చేయడం ద్వారా మరొకరికి కంటి చూపు ఇచ్చినవారవుతారని, నేత్రదానాన్ని ప్రోత్సహించాలని డీఎంహెచ్‌ఓ రవి రాథోడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకసారి కంటిచూపు పోతే తిరిగి రాదని, కంటికి ప్రమాదం జరగకుండా, కంటి జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అంధత్వ నివారణ గురించి అవగాహన కల్పించేందుకు ఈ నెల 25నుంచి సెప్టెంబర్ 8వరకు 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. కంటి సంబంధిత వ్యాధులకు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందుతుందన్నారు.

'సమయపాలన పాటించని అధికారులు'



ఎంపీడీఓ తప్ప అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. గురువారం ఉదయం 11.05 గంటల వరకు ఎంపీడీఓ కిన్నెర యాకయ్య మినహా అధికారులు, సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఈవిషయమై ఎంపీడీఓను 'సాక్షి' వివరణ కోరగా దూర ప్రాంతాల్లోని పట్టణాల్లో నివాసం ఉంటూ రైళ్లు, బస్సుల ద్వారా ఆలస్యంగా వస్తున్నారని తెలిపారు. సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, అధికారులు, సిబ్బంది ఆలస్యంగా రావడం వల్ల తమ పనులు సకాలంలో పూర్తి కావడంలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

సత్తాచాటిన ఆదివాసీ యువకుడు

- అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకంతో వంశీ

వాజేడు: అవకాశం కల్పిస్తే దేశానికి పేరు ప్రఖ్యాతలు సాధించి పెడతామని నిరూపించాడు ఏజెన్సీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మొడెం వంశీ అనే యువకుడు. ఈ నెల 24న ఉత్తర అమెరికాలోని కోస్టారికాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ 68 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. వివరాలిలా ఉన్నాయి.. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని ఇప్పగూడెం మారుమూల గ్రామానికి చెందిన మొడెం మోహన్‌రావు, లక్ష్మీల కుమారుడు వంశీ 10వ తరగతి వరకు చదివాడు. మొదటి నుంచి పవర్ లిఫ్టింగ్‌పై మక్కువ చూపేవాడు. దీంతో అతని ప్రతిభను గుర్తించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు వంశీని ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో గెలుపొంది అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దాతల ఆర్థికసాయంతో అమెరికాలో జరిగిన పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచాడు. ఆర్థికసాయం చేసి సహకరించిన ప్రతిఒక్కరికీ వంశీ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ ఉత్తమ బోధన ఉపాధ్యాయురాలిగా స్నేహలత




హన్మకొండ: జాతీయ ఉత్తమ బోధన ఉపాధ్యాయురాలు–2025 అవార్డుకు నక్క స్నేహలత యాదవ్ ఎంపికయ్యారు. హనుమకొండ గాంధీనగర్ (గోకుల్‌నగర్)కు చెందిన స్నేహలత హైదరాబాద్ కొండాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఆమె 2007 నుంచి సీనియర్ ఇన్స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగ రీత్యా ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. సర్టిఫికెట్ కోర్సు అండ్ ప్లేస్‌మెంట్ వంటి వృత్తి విద్యా కోర్సులను అందిస్తూ వారికి ఉత్తమ విద్యాబోధన చేస్తున్న కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ తెలంగాణ నుంచి నక్క స్నేహలతను ఉత్తమ బోధన ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది. సెప్టెంబర్ 5న న్యూ ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నక్క స్నేహలత అవార్డు అందుకోనున్నారు.

సీఎస్‌సీల్లోనూ విద్యుత్ బిల్లుల స్వీకరణ

నిర్వాహకులకు లాగిన్ అవకాశం కల్పించిన టీజీ ఎన్పీడీసీఎల్

- గ్రామాల్లోనే వినియోగదారులు బిల్లులు చెల్లించే సౌకర్యం
- విద్యుత్ సిబ్బంది అవసరం లేకుండానే బిల్లులు రాబట్టుకునే దిశగా డిస్కం
- టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 6 వేల కామన్ సర్వీస్ సెంటర్‌లు



హన్మకొండ: విద్యుత్ బిల్లుల చెల్లింపులు మరింత సులువు కానున్నాయి. ఇప్పటివరకు గ్రామాలకు విద్యుత్ సిబ్బంది వస్తేనే బిల్లులు చెల్లించేవారు. ఇక నుంచి కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కల్పించింది. ఇప్పటికే బిల్లులు చెల్లింపునకు టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్‌తో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే సౌలభ్యం ఉంది. గ్రామీణ ప్రాంత నిరక్షరాస్యులు, స్మార్ట్ ఫోన్ లేని వారు, వృద్ధులు, మహిళలు ఇప్పటికీ విద్యుత్ ఉద్యోగి వస్తేనే బిల్లులు చెల్లిస్తున్నారు. ఇక నుంచి విద్యుత్ ఉద్యోగి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోని కామన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం పౌరులకు సేవలు అందించేందుకు కామన్ సర్వీస్ సెంటర్‌ల రూపంలో ఐసీటీ ఆధారిత నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కేంద్రాలు ఆధార్ నమోదు, బీమా, పాస్‌పోర్ట్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటి అనేక రకాల సేవలను అందిస్తున్నాయి.

14 రోజుల సమయంలో..

సాధారణంగా గృహ వినియోగదారులు ప్రతీ నెల గ్రామాల్లోకి వచ్చే విద్యుత్ ఉద్యోగికి బిల్లులు చెల్లిస్తున్నారు. రీడింగ్ నమోదు చేసి వినియోగదారుడి చేతికి బిల్లు ఇచ్చిన తర్వాత బిల్లు చెల్లింపు చేయడానికి 14 రోజుల సమయం ఉంటుంది. ఈ 14 రోజుల్లో ఒక్కరోజు మాత్రమే విద్యుత్ ఉద్యోగి బిల్లుల వసూళ్లకు వస్తారు. సీఎస్‌సీల ద్వారా 14 రోజుల్లో ఏ రోజైనా బిల్లులు చెల్లించే సౌలభ్యం వినియోగదారుడికి అందుబాటులోకి రానుంది. సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకులకు టీజీ ఎన్పీడీసీఎల్ లాగిన్ సౌకర్యం కల్పిస్తుంది. లాగిన్ ద్వారా వినియోగదారుల నుంచి బిల్లులు స్వీకరిస్తారు. ఈ మేరకు సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకులు వినియోగదారుల నుంచి కొంత చార్జీలు వసూలు చేస్తారు.

టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 6వేల సీఎస్‌సీలు

టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 17 జిల్లాలు 299 మండలాలున్నాయి. 7,184 గ్రామ పంచాయతీలుండగా దాదాపు ఆరు వేల వరకు కామన్ సర్వీస్ సెంటర్‌లున్నాయి. హెచ్‌టీ సర్వీస్‌లు 5,003, ఎల్‌టీ సర్వీస్‌లు 68,62,858 ఉన్నాయి. ఎల్‌టీ సర్వీస్‌ల్లో గృహ వినియోగదారులు 47,41,394, వాణిజ్య వినియోగదారులు 6,01,303, పారిశ్రామిక వినియోగదారులు 33,753, వ్యవసాయ వినియోగదారులు 13,54,099, ఇతరులు 1,32,309 మంది ఉన్నారు.

బిల్లులు చెల్లించేలా అవగాహన..

ఇప్పటికే డిజిటల్ పేమెంట్‌లను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థలు ఇప్పుడు కామన్ సర్వీస్ సెంటర్‌లను బిల్లులు స్వీకరించేందుకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా క్రమంగా విద్యుత్ బిల్లుల చెల్లింపును పూర్తిగా వినియోగదారుడిని బాధ్యుడిని చేయనుంది. పైగా సిబ్బంది కొరత తీరనుంది. గ్రామాల్లోకి ఉద్యోగిని పంపించడాన్ని విరమించుకోనుంది. ఈ క్రమంలో గ్రామాల్లోని వినియోగదారులు కామన్ సర్వీస్ సెంటర్‌లో బిల్లులు చెల్లించే విధంగా అవగాహన కల్పించనున్నారు.

సైబర్ వలలో ఆలయ ఉద్యోగి

- రూ.8.72 లక్షలు కాజేసిన సైబర్ నేరస్తులు
- పోలీసులకు ఫిర్యాదు



జగన్నాథం క్రెడిట్ కార్డులు



కట్ల జగన్నాథం

కురవి: సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా బాధితులు మోసపోతున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కట్ల జగన్నాథం సైబర్ వలలో చిక్కుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్ జిల్లాకు చెందిన కట్ల జగన్నాథం గత కొన్నేళ్ల నుంచి కురవిలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 26న (మంగళవారం) సైబర్ నేరగాడు 6003447660 నంబర్ నుంచి ఫోన్ చేసి 'హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నా.. మీకు హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ఉంది కదా.. దాని లిమిట్ పెంచుతాం.. ఇది అంతా ఉచితమే' అని చెప్పాడు. దీంతో జగన్నాథం అతడి మాటలను నమ్మాడు. అతడు (సైబర్ నేరగాడు) సెల్‌ఫోన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ 'మై కార్డ్స్' యాప్ ఓపెన్ చేయమని చెప్పడంతో తన మొబైల్‌లో ఆ యాప్ లేదని బాధితుడు తెలిపాడు. సెల్‌ఫోన్ వాట్సాప్‌కు లింక్ పంపిస్తా ఓపెన్ చేయమని చెప్పడంతో జగన్నాథం ఓపెన్ చేశాడు. వెంటనే మైకార్డ్స్ యాప్ లింక్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు గుర్తులతో వచ్చింది. అతను చెప్పినట్లే బాధితుడు లింక్‌ను ఓపెన్ చేయడంతో అందులో రూ.6.89 లక్షలు క్రెడిట్ లిమిట్ పెరిగినట్లు చూపించింది. అనంతరం అవతలి వ్యక్తి ఇంకా నీకు ఏమైనా క్రెడిట్ కార్డులున్నాయా? అని అడిగాడు. ఎస్‌బీఐ, యాక్సిస్‌బ్యాంక్, ఇండస్‌ల్యాండ్ కార్డులున్నాయని చెప్పడంతో అవతలి వ్యక్తి ఫోన్ పెట్టేశాడు. అన్ని కార్డుల గురించి ఎందుకు అడిగాడని అనుమానం రావడంతో వెంటనే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు యాప్‌లో చెక్ చేయగా అందులో నుంచి రూ.1,61,353 డెబిట్ అయినట్లు గుర్తించాడు. దీంతో వెంటనే అవతలి వ్యక్తి ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయడంతో సాయంత్రం వరకు మీకు డబ్బులు వస్తాయని చెప్పి ఫోన్ కట్ చేశాడు. యాక్సిస్ బ్యాంకు కార్డు నుంచి రూ.3,87,093, ఇండస్ బ్యాంకు క్రెడిట్ కార్డు నుంచి రూ.1,94,498, హెచ్‌డీఎఫ్‌సీ కార్డు నుంచి రూ.1.30లక్షలు కట్ అయ్యాయి. ఇలా నాలుగు క్రెడిట్ కార్డుల నుంచి మొత్తం రూ.8.72 లక్షలు కట్ అయ్యాయి. దీంతో మోసపోయానని గుర్తించి వెంటనే ఆన్‌లైన్‌తో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై గండ్రాతి సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణకు అహర్నిశలు కృషి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయిలో ఉద్యోగులతో మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

హన్మకొండ: భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన భారీ వర్షాలు కురిసిన కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో పర్యటించారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ సర్కిల్ పరిధిలో నేలకూలని 108 విద్యుత్ స్తంభాలకు 87 స్తంభాలు పునరుద్ధరించామని, 21 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు 17 సరి చేశామని, 86 ట్రాన్స్‌ఫార్మర్‌లు నీట మునుగగా 6 ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించామన్నారు. భారీ వరద, ముంపుతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు బ్రేక్‌డౌన్ టీం సిద్ధంగా ఉందని, రేయింబవళ్లు నిబద్ధతతో పని చేస్తున్నారన్నారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో లోడ్ మానిటరింగ్ సెల్ కంట్రోల్‌రూంను పరిశీలించి వర్షాలతో విద్యుత్ సరఫరా, సబ్ స్టేషన్ల పనితీరు, స్తంభాలు, లైన్ల పనితీరు, స్థితిగతులను తనిఖీ చేశారు. వర్షాలతో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులు సెలవులు తీసుకోవద్దని ఆదేశించారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



వెంకన్న (ఫైల్)

మరిపెడ రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం స్టేజితండా గ్రామపంచాయతీ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్టేజితండా గ్రామపంచాయతీ పరిధిలోని మేగ్యాతండాకు చెందిన భూక్య వెంకన్న (35) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వెంకన్నకు పదేళ్ల క్రితం రజితతో వివాహం కాగా, వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లింది. స్టేజితండా పరిధిలోని ఓ వెంచర్‌లో ఆటో నిలిచి ఉండగా గురువారం తెల్లవారుజామున స్థానికులు గమనించి ఆటోలో ఉన్న వెంకన్నను లేపగా ఉలుకుపలుకు లేదు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా నా కొడుకు వెంకన్నను కోడలు రజితతో పాటు మరో వ్యక్తి కావాలనే చంపారని, వారిపై చర్య తీసుకోవాలని ఆరోపిస్తూ మృతుడి తండ్రి హచ్చు మరిపెడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

తల్లితో తనువు చాలించాలనుకున్న కొడుకు..

- కోడిపుంజులతండాలో విషాదం



మున్న (ఫైల్)



చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బయ్యారం: నవమాసాలు మోసిన తల్లితో తాను తనువు చాలించాలనుకొని గడ్డిమందు తాగిన కొడుకు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని కోడిపుంజులతండాకు చెందిన ధరావత్ రాజు మహబూబాబాద్ మండలం సలార్‌తండాకు చెందిన కవితను రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటికే కవితకు వివాహం జరిగి కుమారుడు సాద్విక్ అలియాస్ మున్న(11) జన్మించగా కుమారుడిని తీసుకొని రాజు వద్దకు వచ్చింది. వీరికి కుమార్తె భవ్యశ్రీ జన్మించగా ఈ నెల 21న రాత్రి సమయంలో రాజు, కవితల మధ్య వివాదం చోటుచేసుకోగా 22వ తేదీన ఉదయం కవిత మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగింది. ఇది చూసిన కుమారుడు మున్న అదే గడ్డిమందును తాగగా స్థానికులు ఇద్దరిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మున్న మృతి చెందగా తల్లి కవిత కోలుకుంటుంది. కాగా భార్యాభర్తల మధ్య జరిగిన వివాదంలో అభంశుభం తెలియని చిన్నారి మృతి చెందడంతో కోడిపుంజులతండాలో విషాదం నెలకొంది. మృతుడి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదారమ్మతో మురిసిన జ్ఞానదీపం



గోదావరి ఉధృతి తరలిరావడంతో నీటిమధ్యలో అద్భుతంగా దర్శనమిస్తున్న జ్ఞానదీపం

కాళేశ్వరం: ఈ వర్షాకాలం సీజన్‌లో కాళేశ్వరంలో మూడుసార్లు వీఐపీ ఘాటు వద్ద ఏర్పాటుచేసిన జ్ఞానదీపాలను ప్రాణహిత, గోదావరి వరద ముంచెత్తింది. గురువారం ఎగువ నుంచి గోదావరి వరద పోటెత్తడంతో వరదనీరు జ్ఞానదీపం చుట్టూరా చేరి చూపరులను అద్భుతంగా కనువిందు చేస్తోంది.

వేయిస్తంభాల ఆలయంలో గణపతి ఉత్సవాలు

- ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, పక్కన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



వరసిద్ధి వినాయకుడి అలంకరణలో ఉత్తిష్ఠగణపతి

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితులు మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌ల ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి ఉత్తిష్ఠ గణపతికి కోనేరునీటితో నవరసాభిషేకం నిర్వహించి, హరిద్రాకుంకుమలేపనం గావించి వరసిద్ధివినాయకుడిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విగ్రహదాత శ్రీకుమార్ రెమాండ్స్ షోరూం అధినేత వెనిశెట్టి సుబ్రహ్మణ్యం ఇంటి నుంచి మంగళవాయిద్యాలతో వేదమంత్రోచ్ఛరణలతో ఊరేగింపుగా విగ్రహాన్ని తీసుకువచ్చి విష్ణుమూర్తి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై ప్రతిష్ఠించారు. కళశస్థాపన, మంటపారాధన, నవగ్రహారాధన, అఖండదీపారాధన, శోడషోపచారపూజ, పత్రిపూజ, ఉండ్రాళ్ల నైవేద్యం నివేదన, ఋత్విగ్వరణం, మహాహారతి, తీర్థప్రసాదాల వితరణ జరిపారు. అనంతరం అగ్ని ప్రతిష్టాపన, గణపతి నవగ్రహరుద్రహోమం నిర్వహించారు.

ఆలయ అభివృద్ధికి రూ.75కోట్లు..

మహాగణపతి ఉత్సవాలను ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి రూ.75కోట్లు కేటాయించాలని కేంద్ర పురావస్తు, టూరిజం శాఖ మంత్రి గజేంద్రసింగ్ షికావత్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గట్టు మహేష్‌బాబు, దాత నడిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రవచకులు వంగల సోమయాజులు శమంతకోపాఖ్యానం వినిపించారు.

శ్రీలక్ష్మిగణపతిగా అలంకరణ

గణపతి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు వరసిద్ధి వినాయకుడిగా, రెండో రోజు శ్రీలక్ష్మి గణపతిగా అలంకరించి భక్తులకు దర్శనానికి అనుమతించారు. వేముల సత్యమూర్తి ఆధ్వర్యంలో నిత్యాన్నదానం ప్రారంభించారు. ఆలయ ఈఓ ధరణికోట అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు పులి రజినీకాంత్, గండ్రాతి రాజు, చొల్లేటి కృష్ణమచారి పాల్గొన్నారు. సాయంత్రం శివానంద నృత్యమాల శిష్య బృందంచే కూచిపూడి నృత్యాలు అలరించాయి.

రైల్వే రవాణాకు వర్షం ఎఫెక్ట్

- పలు రైళ్లు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు
- కాజీపేట జంక్షన్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రైల్వే హెల్ప్‌డెస్క్

కాజీపేట రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో దక్షిణ మధ్య రైల్వే అధికారి పలు రైళ్లను దారి మళ్లించగా మరికొన్ని రైళ్లను రద్దు చేశారు. గురువారం కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, సీపీఆర్ఓ శ్రీధర్ మాట్లాడుతూ కాజీపేట నుంచి బల్లార్షా వెళ్లే రెండు ప్యాసింజర్ రైళ్లు, డైలీ రామగిరి ప్యాసింజర్, కాజీపేట-బల్లార్షా వెళ్లే డైలీ అజ్నీ ప్యాసింజర్ రైళ్లను శుక్రవారం రద్దు చేస్తున్నామన్నారు. అలాగే కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లను శుక్రవారం వయా పెద్దపల్లి, పెద్దపల్లి, కరీంనగర్ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్-తిరుపతి (17405) కృష్ణా ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్-నాగర్‌సోల్ (12787) ఎక్స్‌ప్రెస్, ముంబాయి-లింగంపల్లి (17057) ఎక్స్‌ప్రెస్, ఓకా-రామేశ్వరం (16734) ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-ముంబాయి (17058) ఎక్స్‌ప్రెస్, బిజికెటి-కాచిగూడ (17606) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-జైపూర్ (12720) ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-బిజికెటి (17605) ఎక్స్‌ప్రెస్‌ను వయా కాజీపేట బైపాస్ లైన్ మీదుగా పెద్దపల్లి, కరీంనగర్, ఆర్మూర్, నిజామాబాద్ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు. అలాగే కాజీపేట-సిర్పూర్ టౌన్ (17003) వెళ్లే ప్యాసింజర్, కరీంనగర్-సిర్పూర్‌టౌన్ (67772) వెళ్లే పుష్‌పుల్, సిర్పూర్ టౌన్-కరీంనగర్ (67771) వెళ్లే పుష్‌పుల్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలంరోడ్-బల్లార్షా (17033) వెళ్లే సింగరేణి కాజీపేట-బల్లార్షా మధ్య, సిర్పూర్‌టౌన్-భద్రాచలంరోడ్ (17034) వెళ్లే సింగరేణి సిర్పూర్‌టౌన్-కాజీపేట, సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) వెళ్లే ఎక్స్‌ప్రెస్ కాజీపేట-సిర్పూర్‌కాగజ్‌నగర్, సిర్పూర్‌కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (17234) వెళ్లే ఎక్స్‌ప్రెస్ సిర్పూర్‌కాగజ్‌నగర్- కాజీపేట మధ్య రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కాజీపేట జంక్షన్‌లో రైల్వే హెల్ప్‌డెస్క్

వర్షాల కారణంగా కాజీపేట జంక్షన్ మీదుగా అప్ అండ్ డౌన్ రూట్‌లో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్న నేపథ్యంలో రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు, పాక్షికంగా రద్దు, ఆలస్యంగా నడిచే రైళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ప్రయాణికులకు తెలియజేస్తున్నామన్నారు.

పర్యావరణ పోటీల్లో జనగామ ఫస్ట్



ఎస్‌పీసీ సర్టిఫికెట్లతో విద్యార్థులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

- దేశంలోనే మొదటి స్థానం సాధించిన జిల్లా
- కాంపిటీషన్–2025లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు
- 75,156 మంది రిజిస్ట్రేషన్

జనగామ: జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటీషన్–2025లో తెలంగాణకు గర్వకారణంగా జనగామ జిల్లా దేశంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 75,156 రిజిస్ట్రేషన్ నమోదు కావడం రాష్ట్రానికే కాక దేశానికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ మేరకు కలెక్టర్ రిజ్వాన్ బాషా గురువారం సంతోషం వ్యక్తం చేస్తూ ప్రకటన చేశారు.

పోటీలు ఇలా..

జాతీయ పర్యావరణ పోటీలను మూడు దశల్లో జూలై 1వ తేదీన ప్రారంభించారు. పేరు, మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్, భాష వివరాలను రాసి, పర్యావరణ ఫొటోలతో అప్‌లోడ్ చేయాలి. విద్యార్థి తరగతిని బట్టి, ఇతరులకు వృత్తి ఆధారంగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. అనంతరం క్విజ్ దశ ప్రారంభించి నీటి పొదుపు, మొక్కల నాటకం, చెత్త వేరు చేయడం వంటి అంశాలకు సంబంధించి 20 ప్రశ్నలకు జవాబుతో ముగుస్తుంది. ప్రశ్నలకు జవాబు చెప్పిన ఆధారంగా మార్కులను కేటాయించి, ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. విద్యార్థులతో పాటు ఉద్యోగులు, స్వయం సహాయక బృందాలు, అన్ని వర్గాల ప్రజలకు పాల్గొనే అవకాశం కల్పించడంతో జనగామ జిల్లా మొదటి నుంచే దేశంలో రెండో స్థానంలో నిలిచి, ఆగస్టు 18న మొదటి స్థానాన్ని చేరుకుంది. అనంతరం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాతో గట్టి పోటీ నడిపి 10 వేల స్కోర్ మెజార్టీతో దేశంలోనే అగ్రస్థానం దక్కించుకుంది.

అందరి భాగస్వామ్యంతోనే సాధ్యం – కలెక్టర్ రిజ్వాన్ బాషా

భౌగోళిక పరిమితులు, వనరుల కొరత ఉన్నప్పటికీ, మన జిల్లా–మన నీరు కార్యక్రమం, ఇంకుడు గుంతల నిర్మాణం, వనమహోత్సవంలో మొక్కల నాటకం వంటి పర్యావరణ అనుకూల కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంతో ఈ పోటీల్లో అత్యధిక భాగస్వామ్యం సాధ్యమైందని కలెక్టర్ రిజ్వాన్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా మరింత ఉత్సాహం నెలకొందన్నారు. ఆగస్టు 26వ తేదీ రాత్రి వరకు 10 వేల స్కోర్ ఆధిక్యాన్ని కొనసాగించిన జిల్లా, కలెక్టర్ పిలుపుతో వినాయక చవితి రోజు వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మట్టి గణపతి ఫొటోలు అప్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడంతో జాతీయ స్థాయిలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చేసిందన్నారు. ఈ విజయానికి తోడ్పడిన హరితదళ ప్రాజెక్ట్ అధికారి గౌసియా బేగం, ఏఎంఓ శ్రీనివాస్, విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, స్వయం సహాయక సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు.

ఉగ్రరూపం దాల్చిన గోదావరి



కాళేశ్వరం మెయిన్ ఘాట్ వద్ద వరద ఉధృతి

కాళేశ్వరం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ఎస్సారెస్పీ, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల ద్వారా వరద ప్రవాహం తరలిరావడంతో కాళేశ్వరం వద్ద గోదావరి గురువారం సాయంత్రం ఉగ్రరూపం దాల్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ వద్ద 3.52 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలివస్తుంది. దీంతో బ్యారేజీలో మొత్తం 66 గేట్లు ఎత్తి నీటిని దిగువకు అదేస్థాయిలో ఔట్‌ఫ్లో రూపంలో కాళేశ్వరం వైపునకు తరలిస్తున్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్న ప్రాణహితనదితో కలిసి గోదావరి వరద ప్రవాహం పుష్కర ఘాట్లను తాకుతూ 9.500 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు తరలిపోతుంది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో 5.52లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో మొత్తం 85 గేట్లు ఎత్తివేసి ఉంచడంతో అదేస్థాయిలో ఔట్‌ఫ్లో దిగువకు ఇంజనీర్లు తరలిస్తున్నారు. దీంతో గోదావరికి పెద్ద ఎత్తున వరద ఎగువ నుంచి తరలి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తం అవుతున్నారు. శుక్రవారం ఉదయం వరకు భారీగా వరద తరలిరానున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో అన్నారం సమీపంలోని చంద్రుపల్లి వాగు గోదావరి కమ్మేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అన్నారం టు మద్దుపల్లి వరకు రవాణాస్తంభించింది.